క్లుప్తంగా

నేడు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం

నగరి : స్థానిక ఏజేఎస్ కల్యాణ మండపంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గానికి చెందిన సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, వైస్ సర్పంచులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, సింగిల్‌విండో చైర్మన్లు, రాష్ట్ర డైరెక్టర్లు పాల్గొనాలని కోరారు.

సర్వం సిద్ధం

శ్రీరంగరాజపురం : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ అరుణాచలంరెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 8 జిల్లా పరిషత్ స్కూళ్లు ఉన్నాయని, అందులో 49 కొత్తపల్లి మిట్ట, శ్రీరంగరాజపురం పాఠశాలలను పరీక్షలుగా ఎంపిక చేశామన్నారు. మొత్తం 409 మంది విద్యార్థులు పరీక్ష రాయనునట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డు కచ్చితంగా తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్లు తెస్తే కఠిన చర్యలు

నగరి: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకొస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్స్, పోలీస్, మెడికల్ సిబ్బంది సైతం సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎవరైనా సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముందస్తు చెల్లింపులకు 5 శాతం రాయితీ

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీలో ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు మొత్తం పన్నులో 5 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించే వారికి రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోడౌన్‌లో తనిఖీలు



సిమెంట్ గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఈ

నింద్ర: మండల కేంద్రం నింద్రలోని హౌసింగ్ శాఖకు సంబంధించిన సిమెంట్ స్టాక్ గోడౌన్‌ను శనివారం డీఈ వెంకటేశులు తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అందజేస్తున్న సిమెంట్, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు తదితరులు ఉన్నారు.


చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న ఓంశక్తి భక్తులు

నగరి : ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం ఆధ్వర్యంలో కొండచుట్టు మండపం ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమం స్థాపకులు శక్తిఅన్నలగన్ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద ఉద్యమ ఆంధ్రరాష్ట్ర కార్యదర్శి వీటీ భాస్కర్, ఓంశక్తి భక్తులు తొలిరోజు కావడంతో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసి, పుచ్చకాయలను అందించారు. కార్యక్రమంలో పాండు, బాబు, సుబ్రమణ్యం, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవమి వేడుకలు



గంగాధరనెల్లూరు: మండలంలోని దిగవూరు గ్రామంలో శ్రీసీతారాముల భజనమందిరంలో శనివారం వసంతోత్సవంతో శ్రీరామనవమి వేడుకలు ముగిశాయి. శనివారం సాయంత్రం గంగాధరనెల్లూరు, ఎగవూరు, దిగవూరు, బస్టాండ్, బీసీ కాలనీల్లో బ్యాండుమేళాల నడుమ శ్రీసీతారాముల చిత్రపటాన్ని ఊరేగించారు. భజన బృందం శ్రీసీతారాములను కీర్తిస్తూ భజనలు చేశారు. ప్రతి ఇంటి వద్ద కర్పూర హారతులిచ్చి, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తనిఖీ

పాలసముద్రం : పొడి, తడి చెత్త ద్వారా ఎరువుల తయారీపై గ్రీన్‌అంబాసిడర్లు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల విస్తరణాధికారి రమేష్ అన్నారు. శనివారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని ఆయన సర్పంచ్ గాలి మహేష్ బాబుతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను ఉపయోగించుని ఎరువులు తయారు చేసి వాటిని రైతులు సాగు చేసే పంటలకు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గ్రీన్‌అంబాసిడర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- పేదల పక్షానే వైఎస్సార్‌సీపీ సర్కారు
- వచ్చే ఎన్నికల్లో మరోమారు జగనన్నను సీఎంను చేసుకుందాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



బిల్లుదొన్న గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పేదల పక్షాన పోరాటం చేస్తూ, అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని బిల్లుదొన్న, గురవరాజగుంట, పోతువానిగుంట, విజయమాంబాపురం కార్వేటినగరం బీసీ కాలనీల్లో ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ, కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో భాగంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇన్ని సంక్షేమ పథకాలను తాము చూడలేదని, తమ కుటుంబాలు ఇప్పుడు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా కులమతాలకు అతీతంగా ప్రతి మహిళ నోటా జగనన్నే సీఎంగా ఉండాలని ఆశీర్వచనలు అందిస్తున్నారని తెలిపారు. ఈ అభివృద్ధిని ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియాలు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ప్రభుత్వ పథకాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. ఎక్కువమంది విద్యావంతులు డీఎస్సీ పెట్టాలని కోరుతున్నారని, వారి కోరిక మేరకు సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిల్లుదొన్న గ్రామస్తులు తమ గ్రామానికి సీసీ రోడ్డు, ఒకే గ్రామంలో రెండు పంచాయతీలు ఉన్నాయని, ఒకే పంచాయతీగా చేయాలని, గతంలో అసంపూర్తిగా ఆగిపోయిన పక్కాగృహాలకు బిల్లులు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 75 ఏళ్లుగా రోడ్డు లేని గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. బిల్లుదొన్న గ్రామానికి సీసీరోడ్డు ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు బిల్లుదొన్న, అయ్యావారికండ్రిగ, ఎర్రమరాజుపల్లి గ్రామాలకు సెల్ టవర్లు ఏర్పాటు చేయడానికి ఎంపీ రెడ్డెప్ప కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. అలాగే ఉత్తమ వలంటీర్‌గా అవార్డు అందుకున్న మోనాను అభినందించారు.

రాగిజావ ఎలా ఉంది..

పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్థానిక విజయమాంబపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. జగనన్న గోరుముద్ద పథకం కింద అందిస్తున్న రాగిజావ ఎలా ఉందని అడిగారు. అలాగే పుస్తకాలు, షూలు, టై, బ్యాగ్‌లు ఎవరు అందిస్తున్నారని పిల్లలను అడగ్గా.. మా జగన్ మామయ్య ఇస్తున్నారని వారు ముక్తకంఠంతో చెప్పడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సింగిల్‌విండో డైరెక్టర్ లోకనాథరెడ్డి, సర్పంచ్ గోవిందస్వామి, ఎంపీటీసీలు ధన్‌రాజ్, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మార్కండేయులు, స్థానిక నాయకులు మురళి, మహేష్, చందురాజు, ఎంపీడీఓ మోహన్‌మురళి, డీఈ విద్యాసాగర్, విద్యుత్ ఏడీఈ నాగరాజు, హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోజూ దేవున్ని ప్రార్థిస్తున్నా..



కన్నకొడుకులు దూరమైనా నాకు పింఛన్ ఇచ్చి అన్నం పెడుతున్న నా పెద్దకొడుకు జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఆయన చల్లనిచూపుతోనే జీవిస్తున్నా. ఆయన ఎప్పుడూ ముఖ్యమంత్రిగా ఉండాలి. నాలాంటి అనాథలకు అండగా ఉండాలని రోజూ దేవుని ప్రార్థిస్తున్నా.

– గోవిందమ్మ, బిల్లుదొన్న గ్రామం, కార్వేటినగరం మండలం

ఆనందంగా ఉన్నాం..



ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు మాకు అందుతున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా సుమారు రూ.3,19,462 లబ్ధి పొందాం. సొంతింటి కల నెరవేరింది. సీఎం జగనన్నకు మా కుటుంబం ఎప్పుడూ రుణపడి ఉంటుంది

– హరిత,బిల్లుదొన్న, కార్వేటినగరం మండలం

తల్లీపిల్లల ఆరోగ్యంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సుజన

నగరి : తల్లీపిల్లల ఆరోగ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీఓ సుజన అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో సీడీపీఓ కృష్ణవేణి అధ్యక్షతన పోషణ్ పక్వాడా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ తల్లీపిల్లల ఆరోగ్యం మనందరి బాధ్యతని తల్లులంతా పౌష్టికాహారాన్ని సద్వినియోగ పరచుకునేలా చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మరో అతిథి ఎంపీపీ భార్గవి మాట్లాడుతూ ప్రతి ఒక్క హక్కుదారు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం తీసుకుని వారే వాడుకోవాలన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ యుక్త వయస్సు నుంచే ప్రతి బాలికను రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. వైఎస్సార్ కిట్స్ నుంచి ఐరన్ రిచ్ ఫుడ్ అందుతోందని వాటిని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంజీ శ్రీదేవి, ఈఓఆర్డీ లక్ష్మీపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.శంకరమ్మ, కె.శ్యామల, టి.లక్ష్మి, గోపి, సుకన్య, సీసీలు, టీపీవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



మాడవీధుల్లో రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ చిదంబరేశ్వర ఆలయంలో శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రథోత్సవంలో భారీగా జనం పాల్గొన్నారు. శివగామి సమేత చిదంబరేశ్వర స్వాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని చూడడానికి జనం భారీగా రావడంతో వీధులు నిండిపోయాయి. రథాన్ని లాగడానికి పలువురు స్థానికులు ఉత్సాహం చూపారు. హరహర మహదేవా అంటూ రథాన్ని లాగుతూ భక్తులు ముందుకు సాగారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యసేవలు అందిస్తున్న 104 వాహనసిబ్బంది

పాలసముద్రం : ప్రస్తుతం వాతావరణంలో తలెత్తిన మార్పుల కారణంగా సోకే సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 104 వాహన వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణలో ఎంఎల్‌హెచ్‌ఓ సునీత, ఏఎన్ఎం రేవతి సమక్షంలో 104 వాహన సేవలు అందించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలు చిన్నచిన్న వ్యాధులకు కూడా ఆస్పత్రులకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్‌తో బాధపడేవారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నట్లు చెప్పారు. అందువల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 56 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే భవిత 'పది'లం

ప్రతి మనిషి జీవితంలో 10వ తరగతి పరీక్ష ఎంతో కీలకం. ఈ పరీక్షల కోసం గత కొన్ని నెలలుగా విద్యార్థులు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయం విదితమే. ఈసారి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా మెరుగైన సౌకర్యాలు కల్పించింది. బోధన విధానంలో అనేక మార్పులు తీసుకురావడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చి ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం చేశారు.

- పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సన్నద్ధం
- స్టడీ అవర్స్‌తో విద్యార్థులకు మరింత చేయూత
- రేపటి నుంచి పరీక్షలు
- మంచి ఫలితాలు సాధించేలా తర్ఫీదు



పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అవుతున్న టెన్త్ విద్యార్థినులు

పుత్తూరు రూరల్: పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా టీచర్లు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా స్టడీ అవర్స్, రివిజన్ ఎగ్జామ్స్ నిర్వహించి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా సాధన చేయించారు. మరోపక్క పక్కా ప్రణాళికతో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సమాయత్తం అయింది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పుత్తూరు డీవైఈఓ పరిధిలో 16 మండలాలు ఉండగా, 118 స్కూళ్లకు గానూ 53 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 9,617 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందుకోసం 53 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్షా సమయంలో 594 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. గతంలో 11 పేపర్లు ఉండే ప్రశ్నపత్రాలు ఉండేవి. అయితే ఈ ఏడాది ప్రభుత్వం ఏడుకే కుదించింది. ఒక్కో పేపర్ వంద మార్కుల విధానాన్ని తీసుకొచ్చింది. ఈ నూతన విధానంతో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల కోసం విద్యార్థులతో పాటు అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధమయ్యారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు..



పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. పరీక్షా సమయానికి అరగంట ముందు నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తాం. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. విద్యార్థులు ఒకరోజు ముందే వెళ్లి పరీక్షా కేంద్రాలను సరిచూసుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, డెస్కులు తదితర వసతులను ఏర్పాటు చేశాం. విద్యార్థులు గానీ, ఇతర సిబ్బంది గానీ సెల్‌ఫోన్లు తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రఘురామయ్య, డిప్యూటీ డీఈఓ, పుత్తూరు డివిజన్

మంచి మార్కులు సాధిస్తా..



పరీక్షలు వ్రాయడానికి ఉత్సాహంగా ఉన్నా. మా టీచర్లు చెప్పిన పాఠాలను మాచే శ్రద్ధగా చదివించారు. రివిజన్ ఎక్సామ్స్ నిర్వహించారు. దీంతో మాకు పరీక్షలు వ్రాయడానికి కొండంత బలం చేకూరింది. నాతో పాటు మా క్లాస్‌లో అందరూ తప్పకుండా పాస్ అవుతారు.

– మయూరి, విద్యార్థిని, రాచపాళెం హైస్కూల్

స్టడీ అవర్స్‌తో ఎంతో మేలు..



మాకు ప్రతిరోజూ నిర్వహించిన స్టడీ అవర్స్ ఎంతగానో ఉపయోగపడ్డాయి. టీచర్లు ఎప్పటికప్పుడు మాకు తగిన సూచనలు ఇస్తున్నారు. అన్ని సబ్జెక్టులకు మోడల్ పరీక్షలు నిర్వహించడంతో మాకు పరీక్షలంటే భయం పోయింది. రివిజన్ పరీక్షల్లో మేము చేసిన తప్పులను సరిదిద్దారు. మంచి మార్కులతో పాసై పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తా.

– దిలీప్‌ప్రతాప్, విద్యార్థి, రాచపాళెం హైస్కూల్

చెత్తరహిత నగరికి పాటుపడదాం



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, సిబ్బంది

నగరి : ప్రజా పరివర్తనతోనే చెత్త రహిత నగరిని సాధించవచ్చని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శనివారం స్వచ్ఛభారత్ మిషన్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారి స్వచ్ఛ ఉత్సవ్ సందర్భంగా నగరి మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తొప్పమ్మ గుడివీధి వరకు స్వచ్ఛ మాషాల్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరి పట్టణ ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు. తడిచెత్త, పొడిచెత్త హానికరమైన చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. స్వచ్ఛ మాషాల్ మార్చ్ ర్యాలీలో పాల్గొన్న ప్రతిఒక్కరి చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎంఆర్ భూపాలన్, పురపాలక సంఘ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: గర్భిణులు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని పాతపాళ్యం గ్రామంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయు పౌష్టికాహారం, వైఎస్సార్ కిట్‌లో ఇస్తున్న ఆరురకాల వస్తువులు రక్తహీనత రాకుండా కాపాడతాయన్నారు. ప్రతినెల వైద్యపరీక్షలు చేసుకుంటూ డాక్టర్ల సలహాలు పాటించాలన్నారు. అలాగే ఐరన్ మాత్రలు ప్రతిరోజూ మింగాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరునెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ వరలక్ష్మి, ఏఎన్ఎం రేణుక సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో రక్తహీనతకు స్వస్తి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

పుత్తూరు రూరల్: చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా రక్తహీనతకు స్వస్తి పలకవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి చెప్పారు. శనివారం స్థానిక కాపువీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాలలో పోషకాలు మెండుగా ఉంటాయని తెలిపారు. వీటిని గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. చిరుధాన్యాలతో వండిన వంటకాలను, పోషక ఆకు కూరలు, పండ్లు, కూరగాయలను ప్రదర్శిస్తూ మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు లలితకుమారి, ప్రమీల, మోహనలక్ష్మి, అమరావతి, యశోద, నీరజ, సుబ్బమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తను వేర్వేరుగా అందించండి

నగరి : మండలంలోని తెరణి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా మార్చడానికి అదే సమయంలో చెత్తను విడదీసి అందించేలా ప్రజలను సిద్ధం చేయాలని సర్పంచ్ నిర్మలాడింపుల్ నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. శనివారం వాహనం ద్వారా గ్రామంలో చెత్త సేకరణ చేపట్టే సమయంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నివాసితులను కలిసి చెత్తను పంచాయతీవారు తెచ్చే వాహనంలోనే వేయాలని కోరారు. అలాగే తడిచెత్త, పొడిచెత్తను విడదీసి అందించాలని అవగాహన కల్పించారు. మహిళలు పూర్తిగా సహకరిస్తే గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి వీలు కలుగుతుందన్నారు. ఎవరైతే తడిచెత్త, పొడిచెత్తను విడదీసి గ్రీన్ అంబాసిడర్లకు అందిస్తారో వారికి ప్రతినెల బహుమతులు అందిస్తామన్నారు.

ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక శక్తి టీకాలు



కొత్తపేట సచివాలయంలో టీకాలు వేయడాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ రవిరాజు

నగరి : ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక శక్తి టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం నగరి యూపీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లో, బుగ్గ అగ్రహారం పీహెచ్‌పీ పరిధిలోని సచివాలయాల్లో వ్యాక్సిన్లు వేసే ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు వ్యాక్సిన్లు ఎలా వేస్తున్నారు ? సరిపడా వ్యాక్సిన్లు ఉన్నాయా ? ఇంకా వేయాల్సిన వారి జాబితా పెట్టుకున్నారా ? ఉన్న వ్యాక్సిన్లు ఎక్స్‌పైరీ డేట్‌లోపు ఉన్నాయా అని తనిఖీ చేశారు. సైడ్ ఎఫెక్ట్ వచ్చినపుడు, దాన్ని తొలగించే ఏఈఎఫ్ఐ ఇంజెక్షన్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ వేసిన ఇంజెక్షన్‌ను నశింపజేసే హబ్‌కట్టర్‌ను సిబ్బంది ఉంచుకున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వ్యాధినిరోధక టీకాలపై తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 16 టీంలు ఏర్పాటు చేశామన్నారు. 11 సెషన్స్ విజిట్ పూర్తి చేశామన్నారు. వ్యాధినిరోధక టీకాలు వేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని, తనిఖీల్లో అలాంటివి గుర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

వేరుశనగలో తెగుళ్ల నివారణపై అవగాహన



పత్తిపుత్తూరులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

వడమాలపేట: వేరుశనగ పంటకు సోకే తెగుళ్లపై రైతులకు రాస్ కృషి విజ్ఞాన్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పత్తిపుత్తూరు, చింతకాల్వ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ నిత్య హరిత, కదిరి లేపాక్షి, ధీరజ్ రకం విత్తనకాయలు సాగు చేయడం వల్ల నీటి ఎద్దడిని, ప్రధానంగా పురుగు తెగుళ్లను తట్టుకుంటాయని తెలిపారు. రబీ సీజన్‌లో హెక్టారుకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. రైతులు ఈ రకం పంటలు సాగు చేయడం చాలా మంచిదన్నారు. పంట దిగుబడి వచ్చిన తరువాత వాటిని తోటి రైతులు విత్తనాలుగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన పంటను వ్యవసాయ పొలాల్లో సందర్శించారు. అదేవిధంగా నువ్వులు పంటకు వచ్చే తెగుళ్లు, సమస్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ దివ్య, రాముకుమార్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

వడమాలపేట : టీటీడీ అనుబంధ ఆలయమైన అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గ్రామోత్సవం, ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన, శాత్తుమొర, మొదటి గంట, నిత్యకైంకర్యాలు జరిపించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని సర్వాభరణాలు, పూల మాలలతో ఊయలలో అలంకరించి వేద మంత్రాల నడుమ, భక్తుల గోవింద నామస్మరణ నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని మేళ తాళాలు, మంగళవాయిద్యాలు నడుమ తిరు మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఏకాంతసేవలో స్వామివారిని పవళింపజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, షరాబు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోగులతో స్నేహపూర్వకంగా మెలగండి



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది స్నేహభావంతో మెలిగి వైద్యసేవలు అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, గ్రామీణ ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేస్తేనే మాతా శిశు మరణాలు జరగవన్న విషయాన్ని గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

పాలసముద్రం : మండలకేంద్రం పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి పదో పరీక్షలు జరుగునున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ బాబు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 179 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్ష రాయనున్నారని, మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రానికి కిలోమీటర్ దూరం వరకు జిరాక్స్ దుకాణాలు తెరవకూడదని తెలిపారు.